# నిప్పూ నివురు

చేతన రాసిన ఉత్తరంలోని విషయాలు, యశోదను ఒక్క కుదుపు కుదిపాయి.

కూతురు రాసిన ఉత్తరంలోని ప్రతి అక్షరమూ, యశోద గత జీవితాన్నీ - ఆ జీవితంలోని ముప్ఫయేళ్ళ వైవాహిక పుట్టాలనూ- తట్టి లేపాయి. ఎన్నెన్నో ఆలోచనలూ, స్మృతులూ ముసురుకున్నాయి. అమ్మ జీవితం నుంచీ, సొంత బతుకు నుంచీ చేతన ఈ నిజాలను ఏ రకంగా గుర్తించినట్లు అని యశోద ఆశ్చర్యపడింది. కాలాన్నీ, పరిసరాల్నీ మరిచి పోయింది.

సగం తెరచిన కిటికీలోంచీ, ఇంటి ముందున్న కాంపౌండులోని బాదం చెట్టు మీద ఓ పిట్ట అరవటం యశోదకు విన్పించలేదు. బావిలోంచీ నీళ్ళెవరో తోడటం విన్పించటం లేదు, అటూ ఇటూ ఉన్న పక్కవాటాల్లోని వాళ్ళు తలుపులు మూసుకొని ఆనందిస్తున్న టి.వి. కార్యక్రమాల శబ్దం చెవికెక్కలేదు. గడియ వేయని తలుపులు తెరుచుకొని ఇంట్లోకి వచ్చిన భర్తను కూడా యశోద గమనించలేదు. మంచం మీద పడుకొని మధనపడుతున్న యశోదను భర్త ప్రసాదరావు తట్టి లేపినప్పుడు ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగింది. ఉలిక్కిపడి లేచింది.

ప్రసాదరావు, "నిద్రపోతున్నావా"? అని అడిగాడు.

"ఊరికే పడుకున్నా", అంది యశోద.

"ఈ వేళ ట్యూషన్ పిల్లలురాలేదా?" ప్రసాదరావు మరో ప్రశ్న వేశాడు.

"ఆదివారం కదా ! ఉదయం వచ్చి వెళ్ళారు," అంది యశోద.

"సాయంత్రం బ్యాచ్ కూడా ఒకటి పెట్టుకోకూడదా?"

భర్త ప్రశ్నకు యశోదకు కోపం వచ్చింది. దిగమింగుకుంది.

ప్రసాదరావు అవతలి గదిలోకి వెళ్ళి బట్టలుమార్చుకొని వచ్చి, భార్య కెదురుగా కుర్చీ

వేసుకొని కూర్చున్నాడు. యశోదకు తన గొడవను వినిపించాడు:

"ఏం మనుషులో ఏమో? మాట మాట్లాడితే 'మీకేం సార్! మీది రెండు చేతుల సంపాదన' అంటారు. 'ఏదో అవసరాలకే కదా మేమూ అడిగేది. వడ్డీ అడిగినంత ఇస్తాం కదా అప్పు ఇవ్వండి' అంటారు. వెంట పడతారు. తీరా ఇచ్చాక రేపు మాపు అని ఏడుస్తూ తిప్పుతారు. గడువుకు మర్యాదగా వడ్డీలివ్వరు. వాయిదాల ప్రకారం చెల్లు వేయరు. ఛ ఛ వీళ్ళను చూస్తే పరమ రోత పుడుతుంది. ఇలాంటివాళ్ళు ఖర్చులెందుకు పెంచుకోవాలో? షేర్లలో పెడదామా అంటే ఏం పుట్టి మునుగుతుందో అని భయం. నాలుగురూపాయలు మిగలటం చావు కొచ్చింది."

మిగులు రూపాయల చావు ఎలాంటిదో యశోదకు తెలుసు. సాటి ఉద్యోగులకువందకు అయిదు రూపాయల వడ్డీకి తక్కువగా ఇవ్వని భర్త ముఖంలోకి యశోద చూసింది. అది రూపాయల ముఖం. ఆత్మీయతలూ, అనుబంధాలూ, స్నేహాలూ ఏవీ కన్పించని ముఖం అది. యశోద బదులు మాట్లాడలేదు. వంటింట్లోకి వెళ్ళి కాఫీ ప్రయత్నం చేయాలనుకుంది.

అంట్లు తోమే పని మిగిలే ఉంది. రాత్రి వంటపని ఉండనే ఉంది. బాత్‌రూంలో నీళ్ళున్నాయో లేదో? నీళ్ళు తోడే పని ఉండవచ్చు. యశోద వంటగదిలోకి వెళ్ళబోయింది.

'కాస్త కూర్చో. మాట్లాడాల్సింది ఉంది' అన్నాడు ప్రసాదరావు.

ఏం మాట్లాడతాడు? ముద్దా ముచ్చటా? ఫెస్టివల్ అడ్వాన్సు గురించో, పెరిగే డి.ఎ.ను గురించో తప్ప ఏం మాట్లాడతాడు ? బహుశా ఇప్పుడు చేతన మొదటి నెల జీతం గురించి మాట్లాడతాడేమో? యశోద తన చికాకును దాచుకుంటూ కూర్చుంది.

"చేతన ఉత్తరమేమైనా రాసిందా? ఇప్పటికి రెండుత్తరాలు రాశాను. బదులు రాయలేదు. నీకు తప్పకుండా రాసి ఉంటుంది. అమ్మకూతురు కదా?"

'అమ్మ కూతురు' అన్న మాటకు యశోదకు నవ్వు వచ్చింది. పైకి కన్పడకుండా "ఈ వేళ వచ్చింది" అంటూ కవరు అందించింది - ఇవ్వకపోతే వెతికి చదివి నస పెట్టగల మహానుభావుడు అనుకుంటూ.

కవరు మీది అడ్రసు చూసీ చూడగానే, ప్రసాదరావు వ్యంగ్యంగా అన్నాడు:

"నేను చెప్పా కదా? నాకెందుకు రాస్తుంది"

యశోద తమాయించుకోలేక అంది:

" ఆ ఉత్తరంలో మీరు రాసిన ఉత్తరాల సంగతి ప్రస్తావించింది."

ప్రసాదరావు యశోదకు చేతన రాసిన ఉత్తరాన్ని చదవసాగాడు. ఉత్తరం చదువుతున్నప్పుడు భర్త ముఖంలో కలిగేమార్పుల్ని గమనించటానికి యశోద ప్రయత్నించింది. 'ఆ ముఖంలో రంగులు కన్పించవు. నోటిలో కన్పిస్తాయి' అనుకుంది. ఉత్తరం చదువుతూ మధ్య మధ్య వ్యాఖ్యాన రూపంలో పిచికారీ చిమ్మినట్లు ప్రసాదరావు నోటి రంగుల్ని చిమ్మసాగాడు :

"మెస్త్రీ పని నేర్చుకుంటున్న వ్యవసాయ కార్మిక మహిళల బతుకుల్ని దగ్గరగా చూసిందట! సంఘంలో ఆడవాళ్ళ కష్టాలూ, కన్నీళ్ళూ రోజు రోజుకూ తెలిసి వస్తున్నాయట! నువ్వు పడ్డ కష్టాలన్నింటినీ అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తోందట! అయినా నువ్వేం కష్టాలు పడ్డావు? రాళ్ళు మోశావా? కంకరకొట్టావా? మొగుడికో, పిల్లలకో ఇంత తిండి ఉడకేయటం, ఆ స్కూల్లో మూడునాలుగు పీరియడ్లు పాఠాలు చెప్పటం, రెండు ట్యూషన్లు చెప్పటం. ఇవొక కష్టాలని నీ కూతురు. మగవాళ్ళ తిప్పల్లో, సంపాదన కష్టాల్లో 'పోలిస్తే మీవొక ఇబ్బందులా?'

"కాఫీ తాగుదురు. నేను కూడా ఇంత వరకు తాగలేదు" అంది యశోద.

"బయటే ఇంత గొంతులో పోసుకుని వచ్చాన్లే. ఉండు. ఇంకేం రాసిందో చూడనీ" ప్రసాదరావు చేతన ఉత్తరంలోని మరికొంత భాగాన్ని అధ్యయనం చెయ్యటంలో నిమగ్నమయ్యాడు.

'నువ్వయినా ఇంత కాఫీ పెట్టుకొని తాగు' అనలేదు. ఛీ! ఏం మనిషి? అనుకుంది యశోద.

భార్య అవసరాల్ని పట్టించుకోడు. భర్తగా తన అవసరాల్ని వదులుకోడు ఇన్నేళ్ళూ ఒక రకంగా తన వైపు నుంచి నిర్యుద్ధ ఒడంబడికను చేసుకొని బతికేస్తోంది తాను. సుఖమో,దు:ఖమో తెలియని యాభై ఏళ్ళ జీవితాన్ని గడిపేసింది. ఇద్దరు కూతుళ్ళ పెళ్ళిళ్ళు అయ్యాయి. మనుమలూ, మనుమరాళ్ళూ కలిగారు. వాళ్ళ బతుకులేవో వాళ్ళు బతికేస్తున్నారు. మూడో అమ్మాయి చేతన మొన్ననే ఉద్యోగంలో చేరింది. తనకిక ఎనిమిదేళ్ళ సర్వీసుంది. చచ్చిందాకా ఇంటి చాకిరీ తప్పదు, ట్యూషన్లు తప్పవు. తనకు చెందని సంపాదన తప్పదు. గానుగకు కట్టిన ఆవు లాగుంది తన బతుకు. మనశ్శాంతి అంటూ ఉంటే పాఠాలు వినే పిల్లల మధ్యనే !

భార్య వైపు చూడకుండా, ప్రసాదరావు మరో వ్యాఖ్యానపు చిమ్ము చిమ్మాడు:

"ఆహా! నాన్న ఉత్తరాలకు సమాధానం రాయాలని అనిపించలేదట! జీతం డబ్బుల గురించీ, పెళ్ళి సంబంధాల గురించీ మాత్రమే నాన్న రాస్తాడట ! అట్లా రాయకపోతే ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు చేసి ఉండేవాణ్ణేకాదు. ఆ ఇద్దరికీ చదువులు చెప్పించి, ఉద్యోగాల్లో చేర్పించాను. కాస్త వెనకేసి, ఉద్యోగస్తుల్తో పెళ్ళిళ్ల జరిపించాను. ఆ ముందుచూపు ఉంది గనుకనే దీనికి ఉత్తరాలు రాసింది. పొగరు. అమ్మ పొగరు ఎక్కడికి పోతుంది?"

"నాకేం పొగరు? నన్నెందుకంటారు ? మీ మాట కెప్పుడడ్డం చెప్పాను"? అంది యశోద నీరసంగా.

"చెప్పలేదు. చెప్పలేవు. చెప్పవు కూడా. నువ్వు పైకి సాధువు. లోలోపల పెట్టుకున్న కుళ్ళును కూతురుకు ఎక్కించి ఉంటావు", ప్రసాదరావు కసిగా అన్నాడు.

యశోద చలించిపోయి అంది:

"ఆడవాళ్ళు కుళ్ళుకోక చేసేదేముంది, నోళ్ళు నొక్కిపెడితే?"

ప్రసాదరావు రెచ్చిపోయాడు:

"మేము నోళ్ళు నొక్కిపెట్టటం వల్లే చదువులు వెలిగించావు: నువ్వు టీచరుద్యోగం వెలగబెడుతున్నావు. నోరు నొక్కిపెట్టడం వల్లే నీ కూతురు ఇంతింత మాటల్తో ఉత్తరం రాసింది".

తనేమాత్రం మాట కలిపినా, భర్త ఎంత దూరం వెళ్ళగలడో, ఎంత ఛండాలంగా మాట్లాడగలడో, మానసికంగా హింసించగలడో యశోదకు తెలియంది కాదు. తనాచరిస్తున్న ఏకపక్ష నిర్యుద్ధ సంధిని మరొకమారు గుర్తుకు తెచ్చుకుంది.

జవాబివ్వని యశోదను పట్టించుకోకుండా, ఉత్తరంలోని మిగిలిన భాగాన్ని చదవటంలో ప్రసాదరావు మరొక మారు నిమగ్నమయ్యాడు. ఆఫీసులో కూడా ఏ ఫైళ్ళనూ, ఏనాడూ పూర్తిగా చదవని మనస్తత్వం అతనిది. ఇచ్చిన అప్పును కూడా పూర్తిగా ఒకసారి వసూలు చేసుకోనిష్టపడని శిక్షణ అతనిది.

మురుగునీటి గొట్టం పగిలినప్పుడు చిమ్మే మురుగులాగా, ఉత్తరం చదువుతూ చదువుతూ ప్రసాదరావు ఒక్కసారి బుసలు కొట్టాడు:

"ఎంత ధైర్యం? నన్నే పట్టుకొని 'నాన్నలాంటి మగవాణ్ణి చేస్తే పెళ్ళిచేసుకో'నని రాస్తుందా? తననూ, తన జీవితాన్ని కూడా గౌరవించే మనిషినే పెళ్ళి చేసుకుంటానంటుందా? లేకపోతే జీవితాంతం పెళ్ళికాకుండా ఉంటుందట! పేద ఆడముండల సేవ చేస్తుందేమో? ఇంకేం రాసిందో చూడు. 'నీలాంటి అమ్మలందరే నిజమైన నాన్న'లని కూసింది.ఆడ పక్షుల్ని నాన్నలనీ, మగవాళ్ళను అమ్మలనీ ఇకనుంచీ పిలవాలని ఆ అక్కుపక్షి శాసనం చేస్తుందట. పిచ్చి పట్టింది వెధవ ముండకు. కాళ్ళు విరగ్గొట్టి మూల కూచోబెట్టాలి . . . ఇదంతా నీ మూలంగానే"

భర్త రొప్పుడు వెనక ఉన్న మగతనాన్నీ, అహంకారపు సంప్రదాయాన్నీ యశోద ఇక ఏ మాత్రం సహించలేకపోయింది. పరమ నిగ్రహంగా శాంత గంభీరంగా అంది:

"చేతన రాసిందాంట్లో తప్పేముంది? ఒక్కసారి మన ముప్పయేళ్ళ సంసారాన్ని గుర్తుకు తెచ్చుకోండి. ఈ పెళ్ళి నా ఇష్టంతో జరిగిందా? పిల్లల్ని నా ఇష్టంతోనే ముగ్గుర్నీ కన్నానా ? ఈ ఇంటి చాకిరీ, ఈ ఉద్యోగమూ, ఈ ట్యూషన్లూ, వీటన్నిటితో నలిగి చస్తూ కూడా పిల్లల్ని సాకి సంతరించిందెవరు? వాళ్ళను స్కూళ్ళలో చేర్పించెవరు? రోజూ దిగ విడిచి మళ్ళీ తెచ్చిందెవరు? కాలేజీల్లో చేర్పించిందెవరు? ఫీజులు నా జీతంలోంచీ నాకే ఇచ్చి కట్టమన్నారు. కాదా ? పెద్దదానికి ఇంటర్వ్యూ వస్తే తిరుపతి దాకా ఒక్కదాన్నీ ఆ పిల్లను వెంటవేసుకొని వెళ్ళిందెవరు? రెండో దానికి ఇంటర్వ్యూ కోసం హైదరాబాదు తీసుకు వెళ్ళిందెవరు? వాళ్ళు ఉద్యోగాల్లో చేరేప్పుడూ, కాపురాలు పెట్టినప్పుడూ అటూ ఇటూ తిరిగి చచ్చిందెవరు? వాళ్ళ పురుళ్ళు పోసిందెవరు? నిన్న మొన్న చేతనను శ్రీకాకుళం తీసుకవెళ్ళి చింతాడలో ఉద్యోగంలో చేర్పించి ఇల్లు చూసిపెట్టి వచ్చింది నేనుకాదా ? మిమ్మల్ని వెళ్ళమన్నప్పుడల్లా 'నేను వెళితే ఖర్చు లెక్కువ అవుతాయ'ని గునిసారే? ఏ మగతోడుతో ఇవన్నీ చేశానో ఆలోచించి చెప్పండి. వాళ్ళు కడుపున పడినప్పటి నుంచి ఈనాటి దాకా ఏ బాధ్యతల్ని మీరు తీసుకున్నారో, మోశారో చెప్పండి"?

యశోద తొలిసారిగా నిలదీసి అడిగిన ప్రశ్నలకు, ప్రసాదరావు బిత్తరపోయాడు. పైకి మొండిగా అన్నాడు:

"కట్నాలు పోసి పెళ్ళిళ్ళు చేసిందీ, చేసేది కూడా నువ్వు కాదు నేనే' అను."

"అంటాను, తప్పకుండా అంటాను మీరు మాత్రం చెయ్యలేదని. చేతనకు మీరూ నేనూ చెయ్యాల్సిన అవసరం లేదని కూడా అంటాను. ఆపేక్షలు లేని దాంపత్యం చేతనకు వద్దు, భర్త అకౌంటులో జమలు మాత్రం వేసే పెళ్ళి, ఉద్యోగం దాని కొద్దు", యశోద తీవ్ర కంఠంతో ఆవేశంగా అంది.

భార్య యశోదకు అంత కోపం రావటం తమ దాంపత్య జీవితంలోనే ప్రసాదరావు చూడలేదు. అతనిలో అహంకారం బుసలు కొట్టింది. జుట్టు పీకి నాలుగు గుద్దులు గుద్దేవాడే. 'ఈ వయసులో మొండి ధైర్యం చేసి యశోద బయటికి నడిస్తే' అన్న ఆలోచన రావటంతో, ప్రసాదరావులోభయం, పిరికితనం కమ్ముకున్నాయి. ఏడ్పుగంటి మొహంతో గొణిగాడు:

"అనండి అందరూ నన్నే అనండి. నేనేం బావుకున్నాను? ఇరవై ఏళ్ళు ట్రాన్స్‌ఫర్ల చావులు చచ్చి బయటి ఊళ్ళల్లో ఉన్నాను. అడ్డమైన హోటళ్ళ తిళ్ళూ తిన్నాను. సంసారసుఖం లేదు. నిన్నుకాదని పరాయిచోట్ల పరాయి స్త్రీల కోసం ఎగబడలేదు. నానా గడ్డీ తిని ఇంత కూడ బెట్టాను. నిన్నయినా రాచి రంపాన పెట్టానా? నా మీద ఒక్కరికీ జాలిలేదు . . ."

భర్త తాత్కాలిక అపజయాన్ని అతని హీనస్వరంలో యశోద గుర్తించింది. ఆ క్షణంలో. భర్త మీద జాలి వేసింది. "సంసార బంధంలో కావలసింది జాలేనా?" అని తన్ను తాను ప్రశ్నించుకొంది. 'కనీసం చేతన అయినా ఈ రకం జాలికీ, గీలికీ మచ్చిక కాకూడదు' అనుకుంది . . . ఆ కొట్టు మిట్టాటల్లోనే, ఉత్తరం చివరలో చేతన తనను 'నాన్నా!' అని సంబోధించటం యశోదకు గుర్తు కొచ్చింది. అప్పుడు . . .

యశోదకు తెరలు తెరలుగా నవ్వు వచ్చింది . . . ○

ఆ నవ్వును చూసి యాభై అయిదేళ్ళ ప్రసాదరావు బిక్కచచ్చిపోయాడు.

• •

మే 1994, రచన సచిత్ర మాసపత్రిక